E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 23-05-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

చర్చలకు రమ్మంటే కేంద్రం ససేమిరా అంటోంది: సీపీఐ(ఎం) » 3లో

## చివరి గింజ వరకు కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధం: మంత్రి ఉత్తమ్



ఈ కబురు : ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఒక ప్రకటనలో పేర్కొంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ రబీ సీజన్ లో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. గత పాలనలోని 2022-23 రబీ సీజన్ లో మే 22 నాటికి కేవలం 36.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు.

తరువాయి 2లో

# వరంగల్ సభ పై అసంతృప్తి

### భాజపాను మరింతగా టార్గెట్ చేయాల్సిందేమో!



“ఆ పార్టీపై 2 నిమిషాలే మాట్లాడారు
భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తు ఉంటుందనే ఊహాగానాలు
మీ ప్రసంగంలో రేవంత్ పేరు ప్రస్తావించకపోవడం ప్రజలకు నచ్చింది
సభ విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
రజతోత్సవ సభ అనంతరం కేసీఆర్‌కు కవిత లేఖ!”

రాస రజతోత్సవ సభలో భాజపా గురించి కేసీఆర్ తక్కువగా మాట్లాడటంతో.. భవిష్యత్తులో ఆ పార్టీతో భారాస పొత్తు పెట్టుకుంటుందనే ఊహాగానాలను కొందరు మొదలుపెట్టారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

**ఈ కబురు,హైదరాబాద్: భారాస రజతోత్సవ సభలో భాజపాపై కేసీఆర్ పరిమితంగా మాట్లాడటంతో భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారన్న ఊహాగానాలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎల్కతుర్తి సభ అనంతరం అధినేత కేసీఆర్‌కు కవిత రాసినట్టుగా ఓ లేఖ బయటికొచ్చింది. గతంలో కవిత రాసిన లేఖల్లో ఉన్న దస్తూరితో.. ఈ లేఖలోని దస్తూరీ సరిపోలుతోంది. సభ విజయవంతమైనందుకు కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ లేఖ రాసిన కవిత.. పాజిటివ్, నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ పేరిట 8 అంశాలను ప్రస్తావించారు.**

పార్టీ శ్రేణులు పూర్తి ఉత్సాహంతో ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వ్యక్తిగతంగా దూషించకపోవడం చాలా మందికి నచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ గీతం గురించి ప్రస్తావిస్తారని భావించినట్టు తెలిపారు. మొత్తంగా అధినేత నుంచి మరింత పదునైన విమర్శలను పార్టీ శ్రేణులు ఆశించినట్టు లేఖలో పేర్కొన్నారు. ఇదే సమయంలో నెగిటివ్ ఫీడ్ బ్యాక్ పేరిట మరికొన్ని అంశాలను ప్రస్తావించారు. వక్ఫ్ బిల్లు, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ అంశాలను ప్రసంగంలో ప్రస్తావించలేదని అన్నారు. పాత ఇన్‌ఛార్జిలనే నియమించడంతో.. పాత పద్ధతిలోనే ఉద్యమకారులకు సదుపాయాలు కల్పించలేదన్న సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఫామ్‌లు ఇన్‌ఛార్జిల ద్వారా కాకుండా.. అధినాయకత్వమే నేరుగా ఇవ్వాలని సూచించారు. సభా వేదికపైకి కేసీఆర్ వచ్చే వరకు మొదటి నుంచి ఉద్యమంలో ఉన్న వారితో మాట్లాడించి ఉంటే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ధూం.. ధాం.. కార్యకర్తలను ఆకట్టుకోవడంలో విఫలమైందన్నారు. భాజపాను టార్గెట్ చేయాలని వ్యక్తిగతంగా తాను కూడా అనుకున్నానని, వారి బాధితురాలిని కాబట్టి అలా అనుకుని ఉండొచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ విఫలమైందని, భాజపా ప్రత్యామ్నాయం అవుతుందేమోనన్న ఆలోచనలు శ్రేణుల్లో ఉన్నాయని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా భాజపాకు సహకరించామన్న భావనను ప్రజల్లోకి కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లిందని కవిత పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటిస్తారని.. లేదా మార్గనిర్దేశనం చేస్తారని అందరూ భావించినట్టు తెలిపారు. జడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్యే స్థాయి నాయకులు కూడా చాలా మంది కేసీఆర్‌ను కలవడం లేదని బాధపడుతున్నారని పేర్కొన్న కవిత.. కొంత మందికి మాత్రమే అవకాశం ఉంటుందని భావిస్తున్నారని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండాలని, ఇప్పటికైనా ఒకటి రెండ్రోజుల పాటు పార్టీ ప్లీనరీ నిర్వహించాలని కవిత సూచించారు.
ఈ విషయాలపై కాస్త సీరియస్‌గా ఆలోచించాలని తండ్రి కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కవిత కోరారు. ఇంత సుదీర్ఘంగా లేఖ రాసినందుకు క్షమించాలని ఆమె పేర్కొన్నారు.

తరువాయి 2లో



## కాళేశ్వరంపై విచారణ పూర్తయ్యాక.. నోటీసులు ఇవ్వడమేంటి?: కేటీఆర్

కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు.

ఈ కబురు,హైదరాబాద్: కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఒక బ్యారేజీలో 2 పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ పగుళ్లకు బహుశా కాంగ్రెస్ వాళ్లే కారణం కావొచ్చని ఆరోపించారు. వాళ్లే మేడిగడ్డకు బాంబులు పెట్టారని అనుమానం వ్యక్తం చేశారు. కమీషన్ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాళేశ్వరం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు.

తరువాయి 2లో



## అన్ని హద్దులూ దాటుతున్నారు..
### ఈడీ సోదాలపై సుప్రీం సీరియస్

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీరును తూర్పారబట్టిన సర్వోన్నత న్యాయస్థానం

**సమాఖ్య పాలన భావనను ఈడీ కాలరాస్తోంది
ఒక ప్రభుత్వ కార్పొరేషన్ నేరం ఎలా చేయగలదు?
టాస్మాక్‌పై ఈడీ దర్యాప్తు చట్టవిరుద్ధంగా సాగుతోంది
అన్ని ఉల్లంఘనలకు పాల్పడుతోంది**

తమిళనాడు రాష్ట్ర లిక్కర్ రిటైలర్ సంస్థపై ఈడీ మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించిన సుప్రీంకోర్టు

**స్వాగతించిన తమిళనాడు ప్రభుత్వం
ఈడీ దుర్వినియోగాన్ని బీజేపీ మానుకోవాలని డీఎంకే హితవు
ఈడీ రాష్ట్రాల హక్కుల్ని అన్యాయంగా బలవంతంగా లాక్కుంటోందన్న తమిళనాడు సర్కార్
సోదాలు, జప్తులకు చట్టబద్ధత ఉందా? అని నిలదీత**

తరువాయి 2లో

## తెలంగాణలో రేషన్‌కార్డుదారులకు అలర్ట్......
### ఒక్కొక్కరికీ 18 కిలోల బియ్యం..



ఈ కబురు:తెలంగాణ ప్రభుత్వం వర్షా కాలానికి మూడు నెలల రేషన్ బియ్యం నిల్వలను సిద్ధం చేయాలన్న కేంద్ర ఆదేశాలపై స్పందించింది. తక్షణమే సాధ్యం కాదని, జూన్ చివరి వరకు గడువు పొడిగించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. సన్నబియ్యం పంపిణీ పథకం అమలులో ఉన్నందున.. 5 లక్షల టన్నుల బియ్యం నిల్వ చేయడం సవాలుగా మారింది. జూన్‌లో ఒక నెల, జూలైలో రెండు నెలల కోటాను సరఫరా చేయాలని రాష్ట్రం ప్రణాళిక వేస్తోంది.

తరువాయి 2లో

## దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

తరువాయి 2లో

## గుజరాత్ టైటాన్స్‌కు షాకిచ్చిన లఖ్‌నవూ

» 6లో




## నీరజ్‌పైనే దృష్టి

» 6లో



## ఇదొక ఎమోషనల్ జర్నీ: నిధి అగర్వాల్

» 5లో



## న్యూ లుక్‌తో టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్.. ధర ₹6.89 లక్షల నుంచి ప్రారంభం

» 4లో



# మన దళాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాయి



**సిందూరం గన్ పౌడర్‌గా మారితే పర్యవసానం ఎలా ఉంటుందో ప్రపంచంతో సహా శత్రువులకు అర్థమయిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ‘తన రక్తనాళాల్లో ప్రవహిస్తున్నది రుధిరం కాదు.**


***ఆ దేశ వైమానిక స్థావరాలను మన వాయుసేన ధ్వంసం చేసింది , రాజస్థాన్ పర్యటనలో మోదీ , నా రక్తనాళాల్లో ప్రవహించేది రుధిరం కాదు.. సిందూరం: ప్రధాని, 18 రాష్ట్రాల్లో 103 అమృత్ భారత్ స్టేషన్లు వర్చువల్‌గా ప్రారంభం,రాజస్థాన్ రాష్ట్రం బీకానేర్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ***

ఈ కబురు,జైపూర్: సిందూరం గన్ పౌడర్‌గా మారితే పర్యవసానం ఎలా ఉంటుందో ప్రపంచంతో సహా శత్రువులకు అర్థమయిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ‘తన రక్తనాళాల్లో ప్రవహిస్తున్నది రుధిరం కాదు.. సిందూరమని’ భావోద్వేగంగా తెలిపారు. పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాయంటూ భద్రతా దళాలపై ప్రశంసలు కురిపించారు. ఇకపై పాక్ పాల్పడే ప్రతి ఉగ్రదాడికి ఆ దేశానికి భారీ మూల్యం తప్పదని హెచ్చరించారు. పహల్గాం ముష్కరదాడికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా 22 నిమిషాల్లో తొమ్మిది భారీ ఉగ్రస్థావరాలను నేలమట్టం చేశామని వెల్లడించారు. ఆ చర్య ద్వారా మన మహిళల సిందూరాన్ని చెరిపేసిన వాళ్లను మట్టిలో కలిపేసినట్లు చెప్పారు.

» 3లో

» 2లో

## హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తాం కేంద్రమంత్రి కుమారస్వామి



## అణచివేతకు గురైన చోటే పోరాడాలి: రాహుల్ గాంధీ



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిల్లీ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులతో ముఖాముఖీలో మాట్లాడారు. యూనివర్సిటీ నార్త్ క్యాంపస్‌లో పలువురు ఎస్సీ, ఎస్సీ, ఓబీసీ విద్యార్థులతో విద్యాపరమైన సమస్యలపై ఆయన చర్చించారు..

» 3లో

## నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డి

**విరాళాలిస్తే పదవులు కట్టబెడతామని ప్రలోభ పెట్టారు
చార్జిషీట్‌లో ప్రస్తావించిన ఈడీ
ఆరోపణలపై స్పందించని ముఖ్యమంత్రి**

ఈ కబురు,న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పవన్ బన్సల్‌తోపాటు దివంగత నేత అహ్మద్ పటేల్ పేర్లు తెరపైకి వచ్చాయి. గత నెలలో కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో వీరి పేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రస్తావించింది. కానీ, వీరిని నిందితులుగా చేర్చలేదు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతోపాటు మరో ఐదుగురిని నిందితులుగా చేర్చిన సంగతి తెలిసిందే.

» 3లో



మొదటి పేజీ తరువాయి



## చివరి గింజ వరకు కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధం : మంత్రి ఉత్తమ్

**ఈ కబురు : ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఒక ప్రకటనలో పేర్కొంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ రబీ సీజన్ లో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. గత పాలనలోని 2022-23 రబీ సీజన్ లో మే 22 నాటికి కేవలం 36.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. కేసీఆర్‌ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో పోల్చి చూస్తే ఈ ప్రభుత్వం రబీలో మే 22 నాటికి 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేసిందన్నారు.**

**ఈ గణాంకాలే బీఆర్ఎస్ తప్పుడు ప్రచారానికి నిదర్శనమని, చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా తేల్చి చెప్పారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న రైతాంగ అనుకూల విధానాలతో అటు ఖరీఫ్ ఇటు రబీ లోనూ రికార్డు స్థాయిలో ధాన్యాం దిగుబడి వచ్చిందన్నారు. అత్యధికంగా దిగుబడి వస్తుందని ముందు చూపుతో కొనుగోలు కేంద్రాలను పెద్ద సంఖ్యలో పెంచామని తెలిపారు.**

మొదటి పేజీ తరువాయి

# వరంగల్ సభ పై అసంతృప్తి

## భాజపాను మరింతగా టార్గెట్ చేయాల్సిందేమో!

భారాస రజతోత్సవ సభలో భాజపా గురించి కేసీఆర్ తక్కువగా మాట్లాడటంతో.. భవిష్యత్తులో ఆ పార్టీతో భారాస పొత్తు పెట్టుకుంటుందనే ఊహాగానాలను కొందరు మొదలుపెట్టారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సభ అనంతరం పార్టీ అధినేత కేసీఆర్‌కు కవిత రాసినట్లుగా ఒక లేఖ గురువారం బయటకు వచ్చింది. అయితే దీనిపై భారాస వర్గాలు గాని, కవిత కార్యాలయ వర్గాలు గాని స్పందించలేదు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న కవిత శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోనున్న నేపథ్యంలో.. ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. రజతోత్సవ సభ విజయవంతమైందని కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ రాసినట్లున్న ఈ లేఖలో పాజిటివ్, నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ పేరిట అంశాలవారీగా పేర్కొన్నారు.

సానుకూల ఫీడ్‌బ్యాక్

“సభ విజయవంతమవడంతో పార్టీ శ్రేణులు పూర్తి ఉత్సాహంతో ఉన్నాయి. మీ ప్రసంగం పూర్తయ్యేవరకూ శ్రద్ధగా విన్నారు.

మీరు ‘ఆపరేషన్ కగార్’పై మాట్లాడడం చాలా మందికి నచ్చింది.

కాంగ్రెస్ ఫెయిల్.. ఫెయిల్.. అని పార్టీ శ్రేణులతో మీరు చెప్పించిన విధానం బాగుందని అనుకుంటున్నారు.

పహల్గాం అమరులకు నివాళిగా మౌనం పాటించడం బాగుంది.

వ్యక్తిగతంగా ‘రేవంత్‌రెడ్డి’ పేరు తీసి తిట్టకపోవడం చాలామందికి నచ్చింది. ఆయన మిమ్మల్ని రోజూ విమర్శిస్తున్నా... మీరు హుందాగా ఉన్నారనే ఫీడ్‌బ్యాక్ వచ్చింది.

తెలంగాణ అంటే భారాస.. తెలంగాణ అంటే కేసీఆర్ అని మీరు బలంగా చెబుతారని చాలామంది అనుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడంపై, తెలంగాణ గీతం అంశంపై మాట్లాడతారని ఎదురుచూశారు.

మొత్తంగా మీ ప్రసంగంలో ఇంకొంచెం పంచ్‌ని ఆశించారు. అయినా కార్యకర్తలు, నాయకులు సభతో సంతృప్తిగా ఉన్నారు.

పోలీసులకు ఇచ్చిన హెచ్చరిక కూడా శ్రేణుల్లోకి బలంగా వెళ్లింది.

ప్రతికూల ఫీడ్‌బ్యాక్

ఉర్దూలో మాట్లాడకపోవడం

వక్ఫ్ బిల్లుపై మాట్లాడకపోవడం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని విస్మరించడం

ఎస్సీ వర్గీకరణ అంశంపై మాట్లాడకపోవడం

ఇంత పెద్ద సభ నిర్వహణ బాధ్యతలను మళ్లీ నియోజకవర్గ పాత ఇన్‌ఛార్జులకు ఇవ్వడంతో.. వాళ్లు పాత పద్ధతిలో.. తెలంగాణ ఉద్యమకారులకు సదుపాయాలు కల్పించలేదన్న ఫీడ్‌బ్యాక్ కొన్ని నియోజకవర్గాల్లో వచ్చింది.

మళ్లీ పాత ఇన్‌ఛార్జులకే.. స్థానిక సంస్థల ఎన్నికల బీఫాంల బాధ్యతలను పార్టీ అప్పగిస్తుందని ఇన్‌ఛార్జులు చెప్పుకొంటున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునేవారు రిలాక్స్‌గా ఉన్నారు. కానీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులుగా, ఎంపీపీగా ఉండాలనుకునేవాళ్లు... ఇన్‌ఛార్జుల ద్వారా కాకుండా నేరుగా రాష్ట్ర పార్టీ బీఫాంలు ఇవ్వాలని కోరుతున్నారు.

రు సభా వేదిక మీదకు వచ్చేలోపు... 2001 నుంచి మీతో ఉన్న నాయకులకు మాట్లాడే అవకాశం కల్పిస్తే బాగుండేదని చాలామంది అన్నారు.

కార్యకర్తలను ‘ధూం ధాం’.. ఆకట్టుకోవడంలో ఫెయిలైంది.

భాజపా గురించి మీరు కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడటంతో.. చాలామంది భవిష్యత్తులో పొత్తు పెట్టుకుంటారనే ఊహాగానాలు మొదలుపెట్టారు. వ్యక్తిగతంగా నాకు కూడా మీరు ఇంకా బలంగా మాట్లాడాలని ఉండె. నేను బాధపడ్డాను కదా! అందుకని కావచ్చు! మీరు భాజపాను ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందేమో డాడీ.

కాంగ్రెస్‌పై క్షేత్రస్థాయిలో నమ్మకం పోయింది. దానికి భాజపా ప్రత్యామ్నాయం అవుతుందేమో అనే ఆలోచన మన శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికలో మనం పోటీ చేయకుండా.. భాజపాకు సహాయం చేశామనే సందేశం కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింది.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మీరు ప్రత్యేక కార్యాచరణను, మార్గనిర్దేశాన్ని ఇస్తారని అందరూ ఆశించారు.

కనీసం ఇప్పుడైనా.. మనం ఒకటి రెండు రోజులు ప్లీనరీ నిర్వహించి.. శ్రేణుల అభిప్రాయాలను స్వీకరించి, మార్గనిర్దేశం చేయాలి. ఈ విషయంపై కొంచెం సీరియస్‌గా ఆలోచన చేయండి. చాలామంది మీతో ఫొటో దిగాలని, చేయి కలపాలని అంటుంటే.. చాలా హార్ట్ వార్మింగ్‌గా అనిపించింది.

జడ్పీటీసీ సభ్యులుగా, జడ్పీ ఛైర్మన్‌లుగా, ఎమ్మెల్యేలుగా పనిచేసిన నాయకులు చాలామంది.. మిమ్మల్ని కలవడానికి అవకాశం లభించడం లేదని బాధపడుతున్నారు. పరిమితంగా, కొద్దిమందికే కలిసే అవకాశం వస్తోందని భావిస్తున్నారు. దయచేసి అందర్నీ కలవండి. సుదీర్ఘ లేఖ రాసినందుకు సారీ! ధన్యవాదాలు’’ అని కవిత లేఖలో పేర్కొన్నారు.

భారాస అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ భారాస రజతోత్సవ సభలో భాజపాపై కేసీఆర్ పరిమితంగా మాట్లాడటంతో భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారన్న ఊహాగానాలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.



మొదటి పేజీ తరువాయి

మొదటి పేజీ తరువాయి

## హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తాం: కేంద్రమంత్రి కుమారస్వామి




**ప్రధాన మంత్రి ఈ-డ్రైవ్ పథకంకింద హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి కుమారస్వామి తెలిపారు.**

ఈ కబురు,దిల్లీ: ప్రధాన మంత్రి ఈడ్రైవ్ పథకంకింద హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి కుమారస్వామి తెలిపారు. రాష్ట్రాలకు ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై కుమారస్వామి గురువారం ఓ ప్రకటన చేశారు. పీఎం ఈడ్రైవ్ కింద 11వేల ఈ బస్సులు మంజూరు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. సుమారు 11వేల ఈబస్సులను 5 నగరాలకు కేటాయిస్తామన్నారు. వీటిలో బెంగళూరుకు 4,500, దిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1000, సూరత్‌కు 600 బస్సులు కేటాయిస్తామని పేర్కొన్నారు. మొత్తం 14,028 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. పీఎం ఈడ్రైవ్ కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం కేంద్రం రూ.10,900 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## కాళేశ్వరంపై విచారణ పూర్తయ్యాక.. నోటీసులు ఇవ్వడమేంటి?: కేటీఆర్



**కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు.**

ఈ కబురు,హైదరాబాద్: కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఒక బ్యారేజీలో 2 పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ పగుళ్లకు బహుశా కాంగ్రెస్ వాళ్లే కారణం కావొచ్చని ఆరోపించారు. వాళ్లే మేడిగడ్డకు బాంబులు పెట్టారని అనుమానం వ్యక్తం చేశారు. కమీషన్ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాళేశ్వరం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ఘోష్ విచారణ పూర్తయిందని అని చెప్పి.. ఇప్పుడు నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. “సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిలా ఉన్నారు. అప్పు పుట్టలేదని రెమో అంటారు.. రూ.లక్షా 60వేల కోట్లు రాము అప్పు చేశారు. ఉన్న డిక్లరేషన్లకే దిక్కు లేదు.. ఇప్పుడు నల్లమల డిక్లరేషన్ ఎందుకు?నెల రోజులుగా సీఎం మదిలో ఉన్నవి వరల్డ్ బ్యూటీస్, కేసీఆర్‌కు నోటీసులు. మేము కట్టిన వాటి ముందు వరల్డ్ బ్యూటీస్ ఫొటోలు దిగుతున్నారు’’అని కేటీఆర్ అన్నారు.

# తెలంగాణలో రేషన్‌కార్డుదారులకు అలర్ట్.. ఒకొక్కరికీ 18 కిలోల బియ్యం..

జూన్ నెలాఖరు నుంచి అమలు

రాష్ట్రంలో ఆహార భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా.. వర్షాకాలానికి ముందే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం నిల్వలను సిద్ధం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. అయితే.. ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయడం కష్టమని పేర్కొంటూ.. మరో నెల రోజుల గడువు కావాలని కేంద్రానికి లేఖ రాసింది. అంటే.. మే నెలాఖరుకు బదులుగా జూన్ ఆఖరుకు ఈ నిల్వలను సమకూరుస్తామని రాష్ట్ర ప్రభుత్వం తన లేఖలో స్పష్టం చేసింది.

సాధారణంగా.. జూన్ నుంచి వానాకాలం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో సంభవించే వరదలు, వాగులు, వంకలు పొంగడం వంటి ప్రకృతి వైపరీత్యాలు ఆహార ధాన్యాల రవాణాకు తీవ్ర అంతరాయం కలిగిస్తాయి. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, పేద ప్రజలకు ఆహారధాన్యాలు సకాలంలో చేరవేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను జూన్‌లోనే అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఆదేశాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సుమారు 5 లక్షల టన్నుల బియ్యం నిల్వలను సమకూర్చాల్సి ఉంటుంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో.. ఇంత పెద్ద మొత్తంలో బియ్యం కోటాను తక్షణమే సర్దుబాటు చేయటం సవాలుగా మారింది. సన్నబియ్యం సేకరణ, నిల్వ, పంపిణీ ప్రక్రియకు కొంత సమయం పడుతుంది. ఈ ప్రత్యేక పరిస్థితులను వివరిస్తూ.. కేంద్రానికి రాసిన లేఖలో జూన్ ఆఖరు వరకు గడువు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు.. జూన్‌లో ఒక నెల కోటా, జూలైలో రెండు నెలల కోటాను సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. లేదంటే జూన్ నెలాఖరులోనే మూడు నెలలకు ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఒకేసారి మూడు నెలల రేషన్

తెలంగాణలో రేషన్ కార్డు ఉన్న వారికి ఒకొక్కరికి 6 కిలోల చొప్పున పంపిణీ చేస్తుండగా ఒకేసారి మూడు నెలల రేషన్ అంటే 18 కిలోల చొప్పును పంపిణీ చేయనున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆహార భద్రతకు ఎటువంటి లోటు రాకుండా చూసుకోవడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం. రాష్ట్ర ప్రభుత్వ ఈ విజ్ఞప్తిని కేంద్రం సానుకూలంగా పరిశీలించి, అవసరమైన మద్దతును అందిస్తుందని ఆశిద్దాం. తద్వారా.. పేద ప్రజలకు వర్షాకాలంలో కూడా నిరంతరాయంగా ఆహార ధాన్యాలు అందుబాటులో ఉండేలా చూడవచ్చు. ఈ సమన్వయ ప్రయత్నాలు ప్రజలకు భరోసాను కల్పించనున్నాయి.



మొదటి పేజీ తరువాయి

# అన్ని హద్దులూ దాటుతున్నారు.. ఈడీ సోదాలపై సుప్రీం సీరియస్

**ఈ కబురు,న్యూఢిల్లీ/చెన్నై: దేశంలో సమాఖ్య పాలన భావనను తీవ్రంగా ఉల్లంఘిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బరితెగించి ఇష్టారీతిగా ప్రవర్తిస్తోందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తనకు ఇష్టమొచ్చినట్లు దర్యాప్తు చేయడం కోసం హద్దులను మీరి మరీ విపరీత పోకడలతో కేసు దర్యాప్తును ముందుకు తీసుకెళ్తోందని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.**

తమిళనాడు రాష్ట్ర మద్యం రిటైలర్ సంస్థ అయిన “తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్(టాస్మాక్)’’పై నిబంధనలకు విరుద్ధంగా మనీలాండరింగ్ కేసు దర్యాప్తు జరుపుతోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం గురువారం ఈడీపై ఆగ్రహ అక్షింతలు చల్లింది.

తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే టాస్మాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేస్తోందని, ఉన్నతాధికారులను ముఖ్యంగా మహిళలను గంటల తరబడి వేధించి, భయపెడుతోందని తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ వేసిన పిటిషన్‌ను గురువారం సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈడీ దర్యాప్తు తీరును తీవ్రంగా ఆక్షేపించింది. వెంటనే తమిళనాడు రాష్ట్ర లిక్కర్ రిటైలర్ సంస్థపై ఈడీ మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

తిట్లతో తలంటు

డీఎంకే సర్కార్, టాస్మాక్ తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అమిత్ ఆనంద్ తివారీలు వాదించారు. ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజుకు సుప్రీంకోర్టు తిట్లతో తలంటు పోసింది. “ఒక ప్రభుత్వ కార్పొరేషన్ అనేది నేరం ఎలా చేయగలదు?. ఈడీ అన్ని చట్టబద్ధ హద్దులను దాటేసి ఇష్టారీతిగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ సమాఖ్య విధానానికి ఏమాత్రం విలువ ఇవ్వకుండా అన్ని రకాల ఉల్లంఘనలకు పాల్పడుతోంది’’అని సీజేఐ జస్టిస్ గవాయ్ అసహనం వ్యక్తంచేశారు.

ఈడీ దర్యాప్తు చట్టవిరుద్ధంగా సాగుతోందని, అందుకే వెంటనే దర్యాప్తుపై స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. వెంటనే అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కల్పించుకుని “దర్యాప్తును ఆపకండి. దాదాపు రూ.1,000 కోట్ల అక్రమాలు జరిగాయి. కనీసం ఈ ఒక్క కేసులోనైనా ఈడీ హద్దులు దాటలేదని భావించండి’’అని వేడుకున్నారు. రాజు వాదనలను కపిల్ సిబల్ తప్పుబట్టారు. “మద్యం దుకాణాల లైసెన్సుల జారీ అంతా సక్రమంగా ఉన్నాసరే అక్రమాలు జరిగాయని అనవసరంగా నేర విచారణను ఈడీ మొదలెట్టింది. 2014 ఏడాది నుంచి ఇప్పటి దాకా అక్రమంగా డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్, అవినీతి నిరోధక విభాగాలతో తప్పుడు ఫిర్యాదులు ఇప్పించి 41 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు. ఇప్పుడు కొత్తగా ఈడీ రంగంలోకి దిగి అన్యాయంగా టాస్మాక్ కార్యాలయాలపై చట్టవ్యతిరేకంగా దాడులు చేస్తోంది. మహిళా అధికారులను గంటల తరబడి టాస్మాక్ ఆఫీసుల్లోనే నిర్బంధించి ఈడీ అధికారులు వేధించారు. వ్యక్తిగత వస్తువులను లాక్కుని గోప్యతకు, ప్రాథమిక హక్కులకు భంగం కల్గించారు’’అని సిబల్ వాదించారు. ఈడీ దర్యాప్తును సమర్థిస్తూ ఏప్రిల్ 23వ తేదీన మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, టాస్మాక్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెల్సిందే.

రాష్ట్రాల హక్కులను కూలదోస్తోంది

సుప్రీంకోర్టులో తమిళనాడు సర్కార్ సైతం తన వాదనలను బలంగా వినిపించింది. “ఈడీ ప్రవర్తన సమాఖ్య విధానాన్ని కూలదోసేలా ఉంది. రాష్ట్రాల హక్కులను ఈడీ కాలరాస్తోంది. తమ పరిధిలోని నేరాల విచారణ రాష్ట్రాలకు సంబంధించిన విషయంకాగా ఈడీ రాష్ట్రాల హక్కులను అన్యాయంగా, బలవంతంగా లాక్కుంటోంది’’అని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. ఈఏడాది మార్చి ఆరో తేదీ నుంచి మార్చి 8వ తేదీదాకా ఏకధాటిగా 60 గంటలపాటు రాష్ట్రంలో ఈడీ చేసిన సోదాలు, తనిఖీలు, దాడులు, జప్తుల పర్వానికి చట్టబద్ధత ఉందా? అని తమిళనాడు సర్కార్ ఈడీని సుప్రీంకోర్టులో నిలదీసింది.

“మార్చి ఆరో తేదీన టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం సోదాలు, జప్తులు చేశామని ఈడీ చెబుతోంది. కానీ టాస్మాక్ అనేది పూర్తిగా రాష్ట్ర పరిధిలోని సంస్థ. ఇప్పటిదాకా అక్రమంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లలో ఏ ఒక్క దాంట్లోనూ టాస్మాక్ పేరును ‘నిందితుల జాబితా’లో పేర్కొనలేదు. ఎలాంటి ఆరోపణలు లేని, నిందితుల జాబితాలో లేని సంస్థ పరిధిలో, ప్రాంగణాల్లో ఈడీకి విచారణ, దర్యాప్తు చేసే హక్కు లేదు. పీఎంఎల్ఏ చట్టం సైతం ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోంది’’అని తమిళనాడు సర్కార్ కోర్టులో వాదించింది.

“2021లో చివరిసారిగా ఎఫ్ఐఆర్ నమోదైతే ఇంత ఆలస్యంగా సోదాలు చేయడమేంటి?. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం నమ్మశక్యమైన కారణాలు ఉంటేనే దర్యాప్తు/సోదాలు జరపాలి. కానీ ఈడీ ఈ నిబంధనను గాలికొదిలేసింది. సరైన లక్ష్యంలేకుండా రంగంలోకి దూకి అడ్డదిడ్డంగా దర్యాప్తు చేస్తోంది’’అని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. ఈడీని సుప్రీంకోర్టు ఇదే తొలిసారి కాదు. గతంలోనూ చాలా కేసుల్లో పలు సుప్రీంకోర్టు ధర్మాసనాలు ఈడీ వైఖరిని తప్పుబట్టాయి. మనీలాండరింగ్ చట్ట నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారని సర్వోన్నత న్యాయస్థానం ఆక్షేపించింది.

బీజేపీకి చెంపదెబ్బ: సుప్రీంకోర్టు నిర్ణయంపై డీఎంకే వ్యాఖ్య

టాస్మాక్ కేసులో సుప్రీంకోర్టు స్టే నిర్ణయం కేంద్రంలోని బీజేపీకి చెంపదెబ్బలా తగిలిందని తమిళనాడులోని పాలక డీఎంకే పార్టీ వ్యాఖ్యానించింది. ఈ మేరకు డీఎంకే సీనియర్ నాయకుడు, పార్టీ కార్యదర్శి(వ్యవస్థాగతం) ఆర్ఎస్ భారతి గురువారం చెన్నైలో మీడియాతో మాట్లాడారు. “టాస్మాక్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను మేం స్వాగతిస్తున్నాం. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అధికారంలోని లేని రాష్ట్రాలపై ఈడీని ఉసిగొల్పుతున్నారు. 2021లో తమిళనాడులో ఎంకే స్టాలిన్ సారథ్యంలో డీఎంకే సర్కార్ కొలువుతీరాక ఈ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఈడీని రంగంలోకి దింపారు. తాజాగా కోర్టు ఉత్తర్వులు చూశాకైనా బీజేపీ ఈడీని దుర్వినియోగం చేయడం మానుకుంటే మంచిది. తమిళనాడులో మరో 7-8 నెలల్లో శాసనసభ ఎన్నికలున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకునే ఈడీ సోదాలు చేసింది’’అని ఆర్ఎస్ భారతి అన్నారు. కోర్టు నిర్ణయాన్ని విపక్ష పార్టీలు సైతం స్వాగతించాయి.



# మన దళాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాయి

**బీకానేర్-ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ**

దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను రాజస్థాన్‌లోని బీకానేర్‌లో గురువారం మోదీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని ప్రసంగించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం రాజస్థాన్‌లో రూ.26 వేల కోట్లతో చేపట్టనున్న వేర్వేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

**'22 నిమిషాల్లోనే ఉగ్రవాదులను మట్టుబెట్టాం'**

"ఆపరేషన్ సిందూర్ పట్ల దేశ ప్రజలంతా గర్వపడుతున్నారు. త్రివిధ దళాలు చక్రవ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. మన మహిళల సిందూరం చెరిపేసిన వాళ్లను మట్టిలో కలిపేశాం. పహల్గాం ఘటనకు జవాబుగా 22 నిమిషాల్లోనే ఉగ్రవాదులను మట్టుబెట్టాం. భారత్‌లో రక్తపుటేర్లు పారించినవాళ్లను ముక్కలు ముక్కలు చేశాం. ఉగ్రదాడికి భారత్ స్పందన ప్రతీకార క్రీడకాదు..న్యాయానికి కొత్త రూపం. సమర్థ భారత రౌద్ర రూపం. ఉగ్రదాడి జరిగితే, మన సమాధానం ఇలాగే ఉంటుంది. ఉగ్రవాదులకు ఇకపై ఇలాంటి జవాబే దక్కుతుంది. పాక్‌తో వాణిజ్యంలేదు..చర్చలు లేవు. ఒకవేళ చర్చలంటూ జరిగితే అది పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌పైనే. దాయాది దేశపు అణు ముప్పు బెదిరింపులకు దేశం జడుసుకునేది లేదు..ఉగ్రదాడి జరిగితే కోలుకులేని విధంగా సమాధానం ఇస్తాం. ఎప్పుడు ఎలా దెబ్బకొట్టాలో సైన్యం చూసుకుంటుంది. ఉగ్రవాదులను, వారిని ప్రోత్సహించేవారిని ఒకటిగానే భావిస్తాం. మనదేశానికి చెందిన న్యాయబద్ధమైన నీటి వాటాలో ఒక చుక్క కూడా పాకిస్థాన్ పొందలేదు. ఉగ్రవాదులను ఎగుమతి చేస్తున్నంతకాలం మన పొరుగుదేశం ప్రతి పైసాను అడుక్కోవల్సిందే. సీమాంతర ఉగ్రవాదానికి దాయాది దేశం మద్దతు తెలిపినంత కాలం ఆ దేశంతో కుదుర్చుకున్న సింధూ జలాల ఒప్పందాన్ని మనం సుప్తచేతనావస్థలోనే ఉంచుతాం.

'మోదీ ఉన్నారనేది పాక్ మరిచిపోయింది'

పాక్ ఎప్పుడూ మనతో నేరుగా యుద్ధం చేయలేదు. చేస్తే ఓటమి పాలవుతామని ఆ దేశానికి తెలుసు. అందుకే దొంగదెబ్బ తీయడానికి ఉగ్రవాదాన్ని ఎంచుకుంది. ఇక్కడ మోదీ ఉన్నారనే సంగతి మరిచిపోయినట్టుంది. రాజస్థాన్‌లోని వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించింది. కానీ, రాజస్థాన్ ఎయిర్‌బేస్‌ను పాకిస్థాన్ క్షిపణులు తాకలేకపోయాయి. మన వాయుసేన పాక్‌లోని ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసింది" అని మోదీ పేర్కొన్నారు.

'గతం కంటే ఆరు రెట్లు అధికంగా ఖర్చు చేస్తున్నాం'

"ఇక్కడికి కర్ణిమాత ఆశీస్సులు తీసుకుని వచ్చా. గత 12 ఏళ్లుగా దేశంలో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించే మహాయజ్ఞం జరుగుతోంది. గతంలో కంటే ఆరు రెట్లు ఆధికంగా మౌలిక సదుపాయాలపై ఖర్చు చేస్తున్నాం. కశ్మీర్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నాం. గతంలో రైల్వే స్టేషన్లు ఎలా ఉండేవి, ఇప్పుడెలా ఉన్నాయో ఆలోచించండి. అమృత్ భారత్ స్టేషన్లను ఆయా ప్రాంతాల ప్రత్యేకతలతో నిర్మించాం. ఈ రైల్వే స్టేషన్లకు ప్రజలే యజమానులు. శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలదే" అని మోదీ చెప్పారు.



# అణచివేతకు గురైన చోటే పోరాడాలి: రాహుల్ గాంధీ

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులతో ముఖాముఖీలో మాట్లాడారు. యూనివర్సిటీ నార్త్ క్యాంపస్‌లో పలువురు ఎస్సీ, ఎస్సీ, ఓబీసీ విద్యార్థులతో విద్యాపరమైన సమస్యలపై ఆయన చర్చించారు..**

ఈ కబురు,ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులతో ముఖాముఖీలో మాట్లాడారు. యూనివర్సిటీ నార్త్ క్యాంపస్‌లో పలువురు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులతో విద్యాపరమైన సమస్యలపై ఆయన చర్చించారు. విద్యార్థులు అన్నింటా ప్రాతినిధ్యం, సమానత్వం, విద్యాపరమైన న్యాయం వంటి పలు అంశాలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత సూచించారు. ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులు హాజరై తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల భాగస్వామ్యం, సమ్మిళిత విద్యాసంస్థల ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలుస్తోంది అధ్యాపక పదవుల్లో బడుగు వర్గాల ప్రాతినిధ్యం లేకపోవడంపై ఈ సందర్భంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పదవుల నియామకాలల్లో కూడా తమ వర్గాలపై చిన్నచూపు ఉందని వారు కాంగ్రెస్ నేతకు తెలిపారు. జాతీయ విద్యా విధానం కింద నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో కూడా అసమానతలు ఉన్నాయన్నారు. విద్యాపరంగా తమకు సరైన వసతులు కల్పించడం లేదని, గైర్హాజరు స్థితిగతులపై మార్కింగ్ చేపట్టకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "విద్యార్థులు డా. బీఆర్ అంబేద్కర్ సందేశాన్ని తప్పకుండా ఆచరించాలి.. విద్యార్థులు "చదవాలి, నిలదీయాలి, వ్యవస్థీకరించాలి". న్యాయమైన, సమగ్ర విద్యా పర్యావరణ వ్యవస్థను సృష్టించడంలో స్టూడెంట్స్ కీలక పాత్ర పోషించాలి. విద్యార్థుల పాత్ర తరగతి గదులకు బయట కూడా ఉండాలి. అణచివేతకు గురైన, ప్రాతినిధ్యం తక్కువైన చోట హక్కుల కోసం పోరాడాలి" అని కాంగ్రెస్ నేత వ్యాఖ్యానించారు. కాగా.. విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చినందుకు వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రౌణాక్ ఖాత్రీ రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.




# పహల్గాం ఘటన.. మళ్లీ నోరు పారేసుకున్న పాక్ ప్రధాని!

**హల్గాం ఉగ్రదాడి ఘటన దురదృష్టకరమని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు.**

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడి ఘటన దురదృష్టకరమంటూనే పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మళ్లీ నోరు పారేసుకున్నారు. 1971 యుద్ధం నాటి ఓటమికి తాము ప్రతీకారం తీర్చుకున్నామంటూ అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. భారత్ పాక్ మధ్య ఇటీవల నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రమాదకర మలుపు తీసుకొని ఉండేదన్నారు. భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ముజఫరాబాద్‌లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు.

"పహల్గాం ఘటన దురదృష్టకరం. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు ఏ క్షణంలోనైనా తీవ్ర రూపం దాల్చే పరిస్థితులు కనిపించాయి" అని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడి ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని కోరినా భారత్ దాన్ని తిరస్కరించిందన్నారు. పహల్గాం ఘటనపై అంతర్జాతీయ స్థాయి దర్యాప్తునకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకారం తీర్చుకున్న విషయం తెలిసిందే. మే 7న పాక్, పీవోకేలోని ఉగ్రమూకల శిబిరాలను సైన్యం నేలమట్టం చేసింది. అనంతరం మే 8 నుంచి మూడు రోజుల పాటు సరిహద్దు ప్రాంతాల్లో పాక్ సైన్యం కాల్పులకు తెగబడుతూ.. పదే పదే కవ్వింపు చర్యలకు దిగడంతో భారత సైన్యం దీటుగా బదులిచ్చింది. భారత సైన్యం దాడుల్లో తీవ్రంగా నష్టపోయిన పాకిస్థాన్.. చివరకు కాల్పుల విరమణ ఒప్పందానికి రావడంతో సరిహద్దుల్లో పరిస్థితి సద్దుమణిగింది.



# మిస్ వరల్డ్ టాలెంట్ ఛాంపియన్ ఇండోనేసియా సుందరి

**తమ ప్రతిభాపాటవాలను మిస్ వరల్డ్ పోటీదారులు చాటుకున్నారు. పోటాపోటీగా నైపుణ్యాలను ప్రదర్శించారు. గురువారం శిల్పకళా వేదికగా జరిగిన మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలేలో 24 దేశాల అందగత్తెలు పోటీపడగా ఇండోనేసియా భామ మోనికా కేజియా సెంబిరింగ్ పియానో వాయిస్తూ.. పాటపాడుతూ మైమరిపించి మొదటి స్థానంలో నిలిచారు.**

**శిల్పకళా వేదికపై పోటాపోటీగా సాగిన నైపుణ్య ప్రదర్శనలు**

**జానపద గీతానికి నృత్యంతో ఉర్రూతలూగించిన అందగత్తెలు**

**బాలకృష్ణుల చుట్టూ గోపికల్లా....**

**శిల్పారామంలో బాలకృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులతో నృత్యాలు చేస్తున్న సుందరీమణులు**

ఈ కబురు, హైదరాబాద్: తమ ప్రతిభాపాటవాలను మిస్ వరల్డ్ పోటీదారులు చాటుకున్నారు. పోటాపోటీగా నైపుణ్యాలను ప్రదర్శించారు. గురువారం శిల్పకళా వేదికగా జరిగిన మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలేలో 24 దేశాల అందగత్తెలు పోటీపడగా ఇండోనేసియా భామ మోనికా కేజియా సెంబిరింగ్ పియానో వాయిస్తూ.. పాటపాడుతూ మైమరిపించి మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో మిస్ కామెరూన్ ఇస్సే ప్రిన్సెస్ నిలవగా, ఇటలీ భామ చైరా ఎస్పోసిటీ.. తన బ్యాలే నృత్యంతో ఆకట్టుకుని మూడో స్థానం సాధించారు. గురువారం సుమారు మూడు గంటల పాటు హైదరాబాద్ శిల్పకళావేదికలో అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. పోటాపోటీగా సాగిన ఆటపాటలు అందరినీ అలరించాయి.

టాలెంట్ ఛాంపియన్ ఇండోనేసియా భామ మోనికా కేజియా సెంబిరింగ్, రెండు, మూడు స్థానాల్లో నిల్చిన కామెరూన్ సుందరి ఇస్సే ప్రిన్సెస్, ఇటలీ భామ చైరా ఎస్పోసిటీ

మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్ ఈవెంట్స్‌లో మిస్ నైజీరియా వరల్డ్ చేసిన ఇండో ఆఫ్రికన్ డాన్స్ అందర్నీ ఆకట్టుకుంది. శ్రీలంక భామ ఆ దేశ సంప్రదాయ నృత్యంతో అలరించారు. ఐస్ స్కేటింగ్‌తో అద్భుత విన్యాసాలు చేసిన మిస్ నెదర్లాండ్స్ ప్రత్యేకంగా నిలిచారు. చెక్ రిపబ్లిక్ సుందరీమణి పియానో ద్వారా చక్కటి సంగీతాన్ని వినిపించారు. మిస్ బ్రెజిల్ తన అభిరుచి అయిన కథల గురించి 'ఐ లవ్ స్టోరీస్' అనే అద్భుత గీతం పాడి ఆకట్టుకున్నారు. అర్జెంటీనా సుందరి అర్బన్ డ్యాన్స్‌తో అలరించగా.. ఫ్లోర్ డాన్స్‌తో మైమరిపించిన ఎస్తోనియా సుందరీమణి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అర్బన్ డ్యాన్స్ మూవ్‌మెంట్స్‌తో మిస్ అర్జెంటీనా ఆకట్టుకున్నారు. వేల్స్ కంటెస్టెంట్.. సీపీఆర్ ఎలా చేయాలో వినూత్నంగా ప్రదర్శించారు. ఆస్ట్రేలియా అందగత్తె తన పాటతో అందర్నీ మైమరిపించారు. కెన్యా పోటీదారు డీజే ప్రదర్శనతో ఉర్రూతలూగించారు. చివరగా.. ఇరవై నాలుగు మంది సుందరీమణులు.. 'రానూ బొంబయికి రానూ..' అంటూ తెలుగు జానపద గీతానికి అద్భుతంగా డ్యాన్స్ చేసి మైమరిపించారు.

జానపద గీతానికి నృత్య ప్రదర్శనలో మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా, ఇతర పోటీదారులు

నేడు హెడ్ టూ హెడ్ ఫైనల్..

పోటీల్లో భాగంగా శుక్రవారం ట్రైడెంట్ హోటల్‌లో హెడ్ టూ హెడ్ ఫైనల్ జరగనుంది. టీహబ్‌లో రెండు రోజుల పాటు నాలుగు గ్రూపులకు చెందిన అందాల భామలు తమ ప్రదర్శనలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో తదుపరి రౌండ్‌కు ఎంపికైన వారు హెడ్ టూ హెడ్ ఫైనల్‌లో పాల్గొంటారు.

అందాల ఆటవిడుపు

విక్టోరియా మెమోరియల్ హోమ్‌లో విద్యార్థినులతో మిస్‌వరల్డ్ పోటీదారులు

ప్రపంచ సుందరి పోటీదారుల్లోని ఐరోపా దేశాల అందగత్తెలు గురువారం ఉదయం మాదాపూర్‌లోని శిల్పారామంలో సందడి చేశారు. మంత్రి సీతక్కతో కలిసి ఇందిరా మహిళా శక్తి బజారులో స్టాళ్లను సందర్శించారు. ప్రపంచ సుందరి పోటీదారులు 60 మంది గురువారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని చారిత్రక విక్టోరియా మెమోరియల్ హోమ్‌లో నడుస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు.





# నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డి



అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను అక్రమంగా కొట్టేయడానికి కుట్ర జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఆస్తులను కాజేయాలన్న ఉద్దేశంతోనే యంగ్ ఇండియా సంస్థను స్థాపించినట్లు చెబుతోంది. ఈ సంస్థ ఏర్పాటుకు పలువురు కాంగ్రెస్ నాయకులతోపాటు ఇతరులు 2019-22 మధ్య విరాళాల రూపంలో డబ్బులు సమకూర్చారు. అందుకు ప్రతిఫలంగా పదవులు, ప్రయోజనాలు కట్టబెడతామని ప్రస్తుత తెలంగాణ సీఎం (అప్పటి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు) రేవంత్‌రెడ్డి, పవన్ బన్సల్, అహ్మద్ పటేల్ ప్రలోభ పెట్టారని ఈడీ చార్జిషిట్‌లో పేర్కొంది. సాక్షులను విచారించిన తర్వాతే ఈ విషయం నిర్ధారించుకున్నట్లు స్పష్టంచేసింది. ఈడీ ఆరోపణలపై రేవంత్‌రెడ్డి, పవన్ బన్సల్ ఇంకా స్పందించలేదు.

ఇదిలా ఉండగా,యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటు కోసం రూ.30 లక్షలు విరాళంగా ఇచ్చానని కాంగ్రెస్ నేత అరవింద్ విశ్వనాథ్ సింగ్ చౌహాన్ ఈడీ విచారణలో అంగీకరించారు. అహ్మద్ పటేల్ సూచన మేరకే ఈ డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, ఈడీ గతంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి గీతారెడ్డి, గాలి అనిల్‌కుమార్‌కు కూడా నోటీసులిచ్చి విచారించిన విషయం తెలిసిందే.

# చర్చలకు రమ్మంటే కేంద్రం నసేమిరా అంటోంది: సీపీఐ(ఎం)



**మావోయిస్టు అధిపతి నంబాల కేశవరావు సహా 27 మందిని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది.**

ఈ కబురు,ఢిల్లీ: మావోయిస్టు అధిపతి నంబాల కేశవరావు సహా 27 మందిని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని కేంద్రానికి ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా నసేమిరా అంటూ ఒప్పుకోలేదని, ఇప్పుడు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రాణాలను బలిగొంటోందని ఆక్షేపించింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో ఓ ప్రకటన విడుదల చేసింది. అటు కేంద్రం గానీ, ఇటు భాజపా నేతృత్వంలోని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గానీ చర్చలకు అంగీకరించడంలేదని ప్రకటనలో పేర్కొంది. "చర్చలకు ముందుకు రాకుండా.. 'నిర్మూలన' అనే అమానవీయ విధానాన్ని కేంద్రం అవలంబిస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టుల అంతానికి గడువు దగ్గరపడుతోందని పదేపదే చెబుతున్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి కూడా చర్చలు అనవసరమంటున్నారు. ఈ ఇద్దరి తీరు ఫాసిస్టుల మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని సీపీఐ (ఎం) ప్రకటనలో పేర్కొంది. ప్రజలు, పలు రాజకీయ పార్టీలు చర్చలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వాలకు చెవికెక్కడం లేదని ఆరోపించింది.

మావోయిస్టు చీఫ్ కేశవరావు ఎన్‌కౌంటర్ అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఇదో మైలురాయి విజయం అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌ను సీపీఐ(ఎం)తో సహా సీపీఐ, సీపీఐ (ఎంఎల్) ఖండించాయి. ఘటనపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశాయి. కేశవరావును చట్టబద్ధంగా అరెస్టు చేయకుండా ఎన్‌కౌంటర్‌లో హతమార్చడం.. ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నలు రేకెత్తిస్తోందని సీపీఐ పేర్కొంది.

# దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు. "తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# న్యూ లుక్‌తో టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్.. ధర ₹6.89 లక్షల నుంచి ప్రారంభం




**టాటా మోటార్స్ తన ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది. దీని ధర రూ.6.89 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది.**

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లో ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది. అత్యాధునిక ఫీచర్లు, సరికొత్త డిజైన్‌తో 2025 టాటా ఆల్ట్రోజ్ ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధర రూ.6.89 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. మారుతీ సుజుకీ బాలెనో, హ్యుందాయ్ ఐ20, టయోటా గ్లాంజా వంటి కార్లకు ఇది గట్టి పోటీ ఇవ్వనుంది.

స్మార్ట్, ప్యూర్, క్రియేటివ్, అకాంప్లిష్డ్ ఎస్, అకాంప్లిష్డ్ +ఎస్ వేరియంట్లలో కొత్త ఆల్ట్రోజ్‌ను తీసుకొచ్చారు. ప్రిస్టెన్ వైట్, ప్యూర్ గ్రే, రాయల్ బ్లూ, ఎంబర్ గ్లో, డ్యూన్ గ్లో రంగుల్లో లభిస్తుంది. జూన్ 2 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి.

డిజైన్‌పరంగా 2025 టాటా ఆల్ట్రోజ్‌లో కొన్ని మార్పులు చేశారు. ఎల్ఈడీ హెడ్‌లైట్లు, ఐ-బ్రో స్టైల్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్ ఇచ్చారు. సరికొత్త లుక్‌తో ఆకర్షించేందుకు బంపర్‌ను నూతనంగా తీర్చిదిద్దారు. అల్లాయ్ వీల్స్‌కు కొత్త డిజైన్ అందించారు. యాంబియంట్ లైటింగ్, వాయిస్- ఎనేబల్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఛార్జర్, ఎయిర్ ప్యూరిఫైయర్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 5- స్టార్ GNCAP సేఫ్టీ రేటింగ్‌తో వస్తోంది. సిక్స్ ఎయిర్‌బ్యాగులు, ఈఎస్‌పీ, హిల్ హోల్డ్ అసిస్టెంట్, ఫాగ్ ల్యాంప్స్, 360 డిగ్రీల కెమెరా, ఎస్ఓఎస్ కాల్ ఫంక్షన్ వంటి సేఫ్టీ ఫీచర్లతో తీసుకొచ్చింది. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్, 1.2 లీటర్ల సీఎన్‌జీ ట్విన్ సిలిండర్ ఆప్షన్లు ఉన్నాయి. 5- స్పీడ్ ఎంటీ, 6- స్పీడ్ డీసీఏ, న్యూ 5- స్పీడ్ ఏఎంటీ వంటి ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లతో వస్తోంది.

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



భారతీయ ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. అంతకుముందు వరుస మూడు రోజుల నష్టాల నుంచి కోలుకున్న సూచీలు గురువారం మరోసారి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, అమెరికా బాండ్ల రాబడి పెరగడం వల్ల ఇతర దేశాల ఈక్విటీలపై ప్రభావం చూపడం, వీటికి తోడు ఆసియా ప్రాంతంలో పెరుగుతున్న కొవిడ్19 కేసులు, దేశీయంగా కీలక రిలయన్స్, ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు అధిక నష్టాలకు కారణమయ్యాయి. ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ ఇండెక్స్, ఆఖర్లో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 644.64 పాయింట్లు క్షీణించి 80,952 వద్ద, నిఫ్టీ 203.75 పాయింట్లు కోల్పోయి 24,610 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఆల్ట్రా సిమెంట్ షేర్లు మాత్రమే లాభాలను దక్కించుకున్నాయి. ఎంఅండ్ఎం, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఐటీసీ, హిందూస్తాన్ యూనిలీవర్, రిలయన్స్, ఎన్‌టీపీసీ షేర్లు అధిక నష్టాలను నమోదు చేశాయి. అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 85.97 వద్ద ఉంది.

# జులై 8లోగా మధ్యంతర ఒప్పందం



**దేశీయ ఉత్పత్తులపై ప్రకటించిన 26% టారిఫ్ నుంచి పూర్తి మినహాయింపునివ్వాలని, వాణిజ్య చర్చల్లో భాగంగా అమెరికాను భారత్ కోరుతోందని ఒక ఉన్నతాధికారి తెలిపారు.**

అమెరికాను 26% టారిఫ్ రద్దు కోరుతున్న భారత్
దేశీయ ఉత్పత్తులపై ప్రకటించిన 26% టారిఫ్ నుంచి పూర్తి మినహాయింపునివ్వాలని, వాణిజ్య చర్చల్లో భాగంగా అమెరికాను భారత్ కోరుతోందని ఒక ఉన్నతాధికారి తెలిపారు. జులై 8లోగా ఇరు దేశాలు ఒక మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించే అవకాశం ఉందనీ తెలిపారు. ప్రతీకార టారిఫ్‌లు విధిస్తున్నామంటూ, ఏప్రిల్ 2న భారత ఉత్పత్తులపై అమెరికా అదనంగా 26% టారిఫ్‌ను ప్రకటించింది. అయితే జులై 9 వరకు అంటే 90 రోజుల పాటు అమలును వాయిదా వేసింది. కానీ 10% ప్రాథమిక టారిఫ్‌ను కొనసాగించింది.

భారత్‌అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలి దశను వేగవంతం చేసే దిశగా అమెరికా వాణిజ్య మంత్రితో మంచి చర్చలు జరిగాయని మంత్రి గోయల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. యూఎస్ ట్రేడ్ రెప్రెజెంటేటివ్ జేమిసన్ గ్రీర్, అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుత్నిక్‌లతో భారత వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ వాషింగ్టన్‌లో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. 'చర్చలు సానుకూలంగా నడుస్తున్నాయి. జులై 8లోగా అంటే తొలి దశ చర్చల ముగింపు గడువు (సెప్టెంబరుఅక్టోబరు)కు ముందే మధ్యంతర ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని భారత్ చూస్తోంది. ఇందులో వస్తువులు, టారిఫేతర అడ్డంకులు, డిజిటల్ సేవల వంటివీ ఉండొచ్చు. 26% సుంకం, 10% ప్రాథమిక సుంకం భారత ఉత్పత్తులపై పడకుండా చూడడానికే ప్రయత్నిస్తున్నామని ఆ అధికారి తెలిపారు.

భారత్ ఏం కోరుతుందంటే
జౌళి, రత్నాభరణాలు, తోలు వస్తువులు, గార్మెంట్లు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటి పళ్లపై సుంకం తగ్గింపులను కోరుతోంది. ప్రస్తుతం అత్యంత ప్రాధాన్య దేశాల (ఎమ్ఎఫ్ఎన్) ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాల కంటే దిగువకు భారత ఉత్పత్తులపై టారిఫ్ తగ్గించాలంటే అమెరికా చట్టసభ కాంగ్రెస్ నుంచి ట్రంప్ ప్రభుత్వం అనుమతి పొందాల్సి ఉంటుంది.

అమెరికా ఏం కోరుకుంటోంది
నిర్దిష్ట పారిశ్రామిక వస్తువులు, వాహనాలు (ముఖ్యంగా విద్యుత్తు మోడళ్లు), వైన్, పెట్రో రసాయన ఉత్పత్తులు, డెయిరీ, వ్యవసాయ వస్తువులు, జన్యుమార్పిడి (జీఎం) పంటల ఉత్పత్తులపై సుంకం తగ్గించాలని కోరుతోంది.
2030 కల్లా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే ఇరుదేశాల లక్ష్యం.

# భారత వృద్ధిని స్వల్పంగా పెంచిన ఫిచ్ రేటింగ్స్

గత కొంతకాలంగా వివిధ రేటింగ్ ఏజెన్సీలు భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ వస్తున్నాయి. దీనికి అమెరికాతో వాణిజ్యం, పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు, వినియోగం క్షీణించడం, గిరాకీ పడిపోవడం వంటి కారణాలను చెబుతున్నాయి. అయితే, తాజాగా ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ భారత వార్షిక వృద్ధి రేటును 0.2 శాతం పెంచడం విశేషం. 2028 ఏడాది వరకు భారత ఆర్థికవ్యవస్థ 6.4 శాతం నమోదు చేస్తుందని గురువారం ప్రకటనలో తెలిపింది. ఇదివరకు 2023లో భారత జీడీపీ 6.2 శాతం పెరుగుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా కట్టింది. దేశంలో ఉద్యోగాలు పొందుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్న ధోరణిని దృష్టిలో ఉంచుకుని సంస్థ ఈ సవరణ చేసింది. దీనికి తోడు ప్రభుత్వ వ్యయం కొనసాగడం, ద్రవ్యోల్బణం లక్ష్య పరిధిలో ఉండటం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పాలసీ విధానాలు వంటి అంశాలు భారత వృద్ధికి స్థిరంగా కొనసాగిస్తాయని నిపుణులు పేర్కొన్నారు. ఇదే సమయంలో చైనా వృద్ధి అంచనాను 0.3 శాతం తగ్గించి 4.6 శాతం నుంచి 4.3 శాతానికి తగ్గించింది. దీని వల్ల ఇతర ఆర్థికవ్యవస్థల కంటే భారత్ వేగవంతమైన వృద్ధిని కొనసాగించగలదనే విశ్వాసం పెరుగుతోంది. వాణిజ్య ఉద్రిక్తతలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు ఉన్నప్పటికీ భారత్ ఇతర దేశాల కంటే మెరుగైన వృద్ధి సాధించగలదని నిపుణులు వెల్లడించారు.




# భారత్‌లో శాంసంగ్ స్లిమ్మెస్ట్ ఫోన్ల తయారీ ప్రారంభం

**శాంసంగ్ గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ ఉత్పత్తిని దేశీయంగా ప్రారంభించినట్లు కంపెనీ గురువారం ప్రకటించింది.**

దక్షిణ కొరియాకు చెందిన స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ శాంసంగ్ తన స్లిమ్మెస్ట్ ఫోన్ల తయారీని భారత్‌లో ప్రారంభించింది. గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ ఉత్పత్తిని దేశీయంగా ప్రారంభించినట్లు గురువారం తెలిపింది. అత్యాధునిక ఫీచర్లతో, హై పర్ఫార్మెన్స్ కలిగిన ఈ ఫోన్ తయారీ నోయిడా ఫ్యాక్టరీలో ప్రారంభమైందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.టెక్ ప్రియులు ఎంతగానో ఎదురుచూసిన గెలాక్సీ ఎస్25 ఎడ్జ్‌ను మే 13న భారత్‌లో లాంచ్ చేసింది. క్వాల్‌కామ్ ఏఐ చిప్‌సెట్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. దీని ధర రూ.1.09 లక్షల నుంచి రూ.1.22 లక్షల మధ్య ఉంది. కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం.. 2024లో భారత్‌లో తయారు చేసిన మొత్తం స్మార్ట్‌ఫోన్లలో యాపిల్, శాంసంగ్ 94 శాతం వాటా కలిగి ఉన్నాయి. 2025 మార్చి త్రైమాసికంలో భారత్‌లో శాంసంగ్ మార్కెట్ వాటా 17 శాతంగా ఉంది. తాజాగా తీసుకొస్తున్న 'ఎస్' సిరీస్ స్మార్ట్‌ఫోన్లు పోర్ట్‌ఫోలియోను విస్తరించడంలో సాయపడ్డాయి.



# ఇదొక ఎమోషనల్ జర్నీ: నిధి అగర్వాల్

ద యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ త్వరలో 'హరిహర వీరమల్లు' చత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా.. క్రిష్, జ్యోతికృష్ణలు సంయుక్తంగా తెరకెక్కించిన ఈ చిత్రానికి ఏఎమ్ రత్నం నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎమ్ ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ మూవీ జూన్ 12 థియేటర్స్‌లోకి రానుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు చిత్ర బృందం. ఈ సందర్భంగా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా.. ఈ సినిమాపై హీరోయిన్ నిధి అగర్వాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది.

"హరిహర వీరమల్లు' చిత్రం నాకు ఒక ఎమోషనల్ జర్నీలాగా అనిపిస్తుంది. ఎందుకంటే మేము ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసి దాదాపు 5 సంవత్సరాలు అవుతుంది. ఈ ప్రాజెక్ట్ బిగింగ్ నుంచి ఇప్పుడు ఎండింగ్ వరకు ఎంతో మందితో షూట్ చేశాము. అందుకే ఈ మూవీ ఎమోషనల్ జర్నీ, ఎమోషనల్ ఫీలింగ్. అండ్ మీ అందరికి ఓ ఇంపార్టెంట్ విషయం చెప్పాలి. నేను పవన్ కల్యాణ్‌కు బిగ్గెస్ట్ ఫ్యాన్‌ను. నిజంగా ఆయనతో నటించే అదృష్టం నాకు దొరడం చాలా సంతోషంగా ఉంది. థాంక్యూ రత్నం సర్.. మీలాంటి హార్డ్ వర్కింగ్ వ్యక్తిని నేను ఎక్కడా చూడలేదు. జ్యోతి సర్ కూడా ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఎంతో హార్డ్ వర్క్ చేశారు. ఈ మోస్ట్ స్పెషల్ ఫిలిమ్ ఎప్పటికి నా హృదయానికి దగ్గరగా ఉంటుంది' అంటూ చెప్పకొచ్చింది.







# తండ్రైన కిరణ్ అబ్బవరం.. ఫొటో షేర్ చేసిన నటుడు

**రహస్య, కిరణ్ అబ్బవరం తల్లీదండ్రులయ్యారు. సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు.**

నటుడు కిరణ్ అబ్బవరం తండ్రి అయ్యారు. గురువారం తమకు బాబు పుట్టాడని తెలిపారు. ఈ శుభవార్తను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ మేరకు ఆయన షేర్ చేసిన ఫొటోలో.. బాబు కాలిని ముద్దాడుతూ కనిపించారు. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

నటి రహస్యను కిరణ్ ప్రేమ పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. 'రాజావారు రాణిగారు'లో కలిసి నటించిన వీరిద్దరు.. వివాహ బంధంతో గతేడాది ఒక్కటయ్యారు.'క' సినిమాతో కిరణ్ గతేడాది మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'కె ర్యాంప్' సినిమాలో నటిస్తున్నారు. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు.



# థియేటర్‌లో పోర్న్ సినిమాలు..

## బిగ్ స్క్రీన్‌పై బూతులో తప్పేముంది..

మనుషులంతా ఒకలాగా ఆలోచిస్తే ఆర్జీవీ మరోలాగా ఆలోచిస్తాడని చర్చించుకుంటారు సోషల్ మీడియా ఫాలోవర్స్. ఇందులో ఎంతో కొంత నిజం లేకపోలేదు. మనుషులన్నాక ఆలోచించి.. పది మందికి నచ్చింది.. చేయాలనుకుంటారు. కానీ ఆర్జీవీ అలా కాదు తనకు నచ్చిందే మాట్లాడుతాడు.. అదే చేస్తాడు కూడా. అందుకే ఈయన లాగా ఒక్కరోజైనా బతకాలని.. అంత స్వేచ్ఛగా మాట్లాడాలని చాలా మంది అనుకుంటారు. ఇక సెక్స్, అమ్మాయిల విషయానికి వస్తే మరీ బోల్డ్‌గా మాట్లాడే వర్మ.. బిగ్ స్క్రీన్‌పై బూతులు వాడటం గురించి ఓ పాడ్‌కాస్ట్‌లో తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చాడు. ఇంటర్నెట్ యాక్సెస్‌తో జస్ట్ ఒక్క క్లిక్ దూరంలోనే పోర్న్, రియల్ లైఫ్ వాయిలెన్స్ అందుబాటులో ఉంటుందని.. అలాంటప్పుడు చిన్న చిన్న బూతు పదాలను మూవీ నుంచి ఎందుకు కట్ చేయాలని ప్రశ్నించాడు. ఎంటర్‌టైన్మెంట్‌ను రిస్ట్రిక్ట్ చేయడంలో సెన్స్ ఏముందంటున్న ఆయన.. సెన్సార్ బోర్డ్ అవుట్‌డేట్ అని, స్టుపిడ్ థింగ్ అని విమర్శించాడు. అసలు ఏ నాలెడ్జ్ లేని ఐదుగురు సభ్యులు.. కోట్ల మంది కోరుకునే ఎంటర్‌టైన్మెంట్‌ను ఎలా డిసైడ్ చేస్తారని క్వశ్చన్ చేస్తున్నాడు.

ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. 'అంటే నీ ఉద్దేశం ఏంటి థియేటర్‌లో పోర్న్ సినిమాలు చూడాలా?' 'సీక్రెట్‌గా చూసే పోర్న్‌ను 70ఎంఎం స్క్రీన్‌పై చూస్తూ ఎంజాయ్ చేయాలా?', 'ఇలా చూసే చిన్న పిల్లలు కూడా రేపిస్టులు అవుతున్నారు. హత్యలు చేస్తున్నారు. సమాజం పూర్తిగా చెడిపోతుంది', 'మియా మాల్కోవా షార్ట్ ఫిల్మ్ నీ తల్లితో కలిసి చూడగలవా', 'డ్రగ్స్ ఈజీగా దొరుకుతున్నాయని వాడి పాడైపోమని చెప్పగలమా?' అని తిట్టిపోస్తున్నారు జనాలు.

# కోర్ట్ సినిమాతో మళ్లీ ఫామ్‌లోకి శివాజీ..

## ఏకంగా ఎన్ని సినిమాలంటే?

సీనియర్ నటుడు శివాజీ ఇప్పడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసి తన నటనా ప్రతిభను మరోసారి ప్రూవ్ చేసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవల 90s సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి గుర్తింపు తెచ్చుకున్న శివాజీ.. తాజాగా 'కోర్ట్' చిత్రంతో తన క్రేజ్‌ను మరింత పెంచుకున్నాడు. ప్రియదర్శి, హర్ష రోషన్, శ్రీదేవి లీడ్ రోల్స్‌లో నటించిన ఈ మూవీ మార్చి 14న వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా ఈ సినిమాలో మంగపతిగా శివాజీ నటనకు విమర్శకుల ప్రశంసలు అందాయి అనడంలో అతిశయోక్తి లేదు. దీంతో.. ఇప్పడు మళ్లీ ట్రాక్ ఎక్కేశాడు శివాజీ. కోర్ట్‌తో వచ్చిన క్రేజ్‌తో వరుస సినిమా ఆఫర్లు అందుకుంటున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే శివాజీ సినిమాలకు సంబంధించి ఇప్పడు ఓ ఇంట్రెస్టింట్ న్యూస్ వినిపిస్తుంది. ఆయన ప్రస్తుతం 8 సినిమాల్లో నటిస్తున్నారు. అంతే కాకుండా.. నిర్మాతగా 3 సినిమాల్ని పట్టాలు ఎక్కించారు. అందులో ఒక సినిమాకు 'సంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే టైటిల్ ఖరారు చేసినట్లు తెలుస్తుంది. అయితే.. ఈ సినిమాలపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.





# నేను ద్రోణాచార్యుడిని కాదు.. విద్యార్థినే: కమల్‌హాసన్

**'థగ్ లైఫ్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధంగా ఉన్నారు కమల్‌హాసన్. ఆ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ప్రెస్‌మీట్‌లో సందడి చేశారు.**

హైదరాబాద్: సినిమాల పరంగా తాను ద్రోణాచార్యుడిని కాదని, ఇంకా విద్యార్థినేనని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ అన్నారు. 'థగ్ లైఫ్' మూవీ ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆయన హీరోగా మణిరత్నం తెరకెక్కించిన సినిమా ఇది. త్రిష హీరోయిన్. శింబు, నాజర్, అశోక్ సెల్వన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జూన్ 5న సినిమా విడుదల కానున్న సందర్భంగా సమావేశం నిర్వహించారు.

ఆ పోస్టు నేను పెట్టలేదు..: ట్రోల్స్‌పై స్పందించిన 'భైరవం' దర్శకుడు

"సినిమా విషయంలో వీళ్లు (చిత్ర బృందం) నన్ను ద్రోణాచార్యుడు అంటున్నారు. అలా అని నా నుంచి మీరు ఎలాంటి పాఠాలు ఆశించొద్దు. నేను సినిమా విద్యార్థిని. నేను మీకు నేర్పాలంటే ఇంకా చాలా నేర్చుకోవాలి. నేను నేర్చుకుంటూనే ఉన్నా.. మీరూ నాతో కలిసి నేర్చుకోండి. మణిరత్నం దర్శకత్వంలో నటించడం నాకు కంఫర్ట్. 'ఇంద్రుడు చంద్రుడు' సినిమాలో తనికెళ్ల భరణి సంభాషణలు రాయాల్సి ఉంది. కానీ, మరో రచయితో కలిసి నేను రాశా. అశోక్ సెల్వన్ ప్రతిభావంతుడు. నాజర్ ఎంత కాన్ఫిడెంట్‌గా ఉంటారో అశోక్ కూడా అంతే. నేను శింబు సినిమాలు చూస్తూ పెరిగా (నవ్వుతూ). అతడిది సినీ నేపథ్య కుటుంబం. శింబు.. చైల్డ్ ఆఫ్ సినిమా. అందుకే మేం ఒకరితో ఒకరం కనెక్ట్ అయ్యాం. మాకు సినిమా తప్ప మరో ప్రపంచం తెలియదు. 'థగ్ లైఫ్'లో నటుల పెర్ఫామెన్స్, రొమాన్స్ ఆకట్టుకుంటుంది. ఈ విషయంలో మణిరత్నానికి థాంక్స్. మణిరత్నాన్ని సుహాసిని వివాహం చేసుకోకముందే నేను, ఆయన సినిమా ద్వారా ఒక్కటయ్యాం. 'థగ్ లైఫ్' టీమ్ అద్భుతం. అందుకే సినిమా ఈవెంట్లను ఇంతగా సెలబ్రేట్ చేస్తున్నాం. వాస్తవానికి ఈ చిత్రానికి ప్రమోషన్స్ అవసరం లేదు. 'నాయకుడు' సినిమాకి మించి 'థగ్ లైఫ్' ఉంటుందని మాటిస్తున్నా. మీ స్పందన కోసం వేచి చూస్తున్నా. మలయాళంలో నేను హీరోని అయ్యా. తెలుగులో స్టార్‌ని అయ్యా. స్టార్‌గా నేను పుట్టిన ఇల్లు ఇదే (టాలీవుడ్)" అని పేర్కొన్నారు.



# గుజరాత్ టైటాన్స్‌కు షాకిచ్చిన లఖ్‌నవూ



**33 పరుగుల తేడాతో సూపర్‌జెయింట్స్ గెలుపు**
**సెంచరీతో చెలరేగిన మార్ష్**
**పూరన్ మెరుపు అర్ధసెంచరీ**

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన గుజరాత్ టైటాన్స్ తదుపరి లక్ష్యం టాప్-2లో చేరడం. ఈ ప్రయత్నానికి లక్నో సూపర్‌జెయింట్స్ అడ్డొచ్చింది. గురువారం జరిగిన పోరులో లక్నో 33 పరుగుల తేడాతో గుజరాత్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్‌జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 235 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 117; 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) శతక్కొట్టగా, నికోలస్ పూరన్ (27 బంతుల్లో 56 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. అనంతరం గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 202 పరుగులు చేసి ఓడింది. షారుఖ్ ఖాన్ (29 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), రూథర్‌ఫర్డ్ (22 బంతుల్లో 38; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మాత్రమే రాణించారు. క్యాన్సర్ అవగాహన-ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతీ సీజన్ తరహాలోనే ఈ సారి కూడా ఒక మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ లావెండర్ రంగు జెర్సీతో బరిలోకి దిగింది.

**ఓపెనింగ్ ధాటితో...**

ఓపెనర్లు మార్ష్, మార్‌క్రమ్ జోడీ లక్నోకు శుభారంభం ఇచ్చింది. గుజరాత్ బౌలర్లపై మార్ష్ విరుచుకుపడటంతో 5.3 ఓవర్లో లక్నో స్కోరు ఫిఫ్టీ దాటింది. మరోవైపు నుంచి మార్‌క్రమ్ (24 బంతుల్లో 36; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా షాట్లతో పరుగుల వేగం పెంచాడు. ఈ క్రమంలో మార్ష్ 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఓపెనర్ మార్‌క్రమ్‌ను కిషోర్ అవుట్ చేసి 91 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. రషీద్‌ఖాన్‌పై మార్ష్ పిడుగల్లే చెలరేగాడు. అతను వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్లో వరుసగా 6, 4, 6, 4, 4, 1లతో ఏకంగా 25 పరుగుల్ని రాబట్టాడు.

మార్ష్ సెంచరీ, పూరన్ ఫిఫ్టీ

మార్□్షతో పాటు వన్‌డౌన్ బ్యాటర్ పూరన్ కూడా ధాటిగా ఆడటంతో ప్రతీ ఓవర్‌కు 10 పైచిలుకు రన్‌రేట్‌తో పరుగులు వచ్చాయి. మార్ష్ 56 బంతుల్లో సెంచరీ సాధించాడు. కాసేపటికే పూరన్ కూడా 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి వీరవిహారంతో లక్నో 17.4 ఓవర్లలో 200 మార్క్ దాటింది. డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడేక్రమంలో మార్ష్ అవుట్‌కాగా... రెండో వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పూరన్‌తో పంత్ (6 బంతుల్లో 16 నాటౌట్; 2 సిక్స్‌లు) అజేయంగా నిలిచాడు.

షారుఖ్ పోరాడినా...

కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు ఆరంభం నుంచే దంచేందుకు దిగిన టాపార్డర్ బ్యాటర్లు అంతే వేగంగా వికెట్లు పారేసుకున్నారు. సాయి సుదర్శన్ (21; 4 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (20 బంతుల్లో 35; 7 ఫోర్లు), బట్లర్ (18 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిష్క్రమించడంతో లక్నో శిబిరం సంబరం చేసుకుంది. కానీ రూథర్‌ఫర్డ్, షారుఖ్ ఖాన్‌లు ధనాధన్ షోకు శ్రీకారం చుట్టడంతో లక్నో గుండెల్లో గుబులు రేగింది. చెరోవైపు నుంచి రూథర్‌ఫోర్డ్, షారుఖ్‌లు సిక్స్‌లు, ఫోర్లతో విజృంభించారు. అంతే... 16 ఓవర్లు గడిచేసరికి స్కోరు 182/3కి చేరింది.

24 బంతుల్లో 54 పరుగుల సమీకరణం గుజరాత్‌ను ఆశల పల్లకిలో ఉంచింది. రూథర్‌ఫోర్డ్, షారుఖ్ నాలుగో వికెట్‌కు 40 బంతుల్లో 86 పరుగులు జోడించారు. అయితే 17వ ఓవర్లో రూథర్‌ఫర్డ్, తెవాటియా (2), మరుసటి ఓవర్లో అర్షద్ ఖాన్ (1) అవుట్ కావడంతో లక్నోకు ఊరట లభించింది. 22 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న షారుఖ్ ఖాన్ పోరాటం సరిపోలేదు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) షారుక్ (బి) సాయి కిషోర్ 36; మార్ష్ (సి) రూథర్‌ఫోర్డ్ (బి) అర్షద్ 117; పూరన్ నాటౌట్ 56; రిషభ్ పంత్ నాటౌట్ 16; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 235. వికెట్ల పతనం: 1-91, 2-212. బౌలింగ్: సిరాజ్ 4-0-37-0, అర్షద్ ఖాన్ 3-0-36-1, రబడ 4-0-45-0, ప్రసి□ద్‌కృష్ణ 4-0-44-0, సాయి కిషోర్ 3-0-34-1, రషీద్ ఖాన్ 2-0-36-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) మార్‌క్రమ్ (బి) రూర్కే 21; గిల్ (సి) సమద్ (బి) అవేశ్ 35; బట్లర్ (బి) ఆకాశ్ సింగ్ 33; రూథర్‌ఫర్డ్ (సి)సబ్-బిష్ణోయ్ (బి) రూర్కే 38; షారుఖ్ (సి) సబ్-బిష్ణోయ్ (బి) అవేశ్ 57; తెవాటియా (సి) హిమ్మత్ (బి) రూర్కే 2; అర్షద్ (సి) రూర్కే (బి) షాబాజ్ 1; రషీద్ ఖాన్ నాటౌట్ 4; రబడా (బి) బదోని 2; సాయి కిషోర్ (బి) బదోని 1; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 202. వికెట్ల పతనం: 1-46, 2-85, 3-96, 4-182, 5-186, 6-193, 7-197, 8-200, 9-202. బౌలింగ్: ఆకాశ్ సింగ్ 3.1-0-29-1, ఆకాశ్‌దీప్ 4-0-49-0, రూర్కే 4-0-27-3, అవేశ్‌ఖాన్ 3.5-0-51-2, షాబాజ్ 4-0-41-1, బదొని 1-0-4-2.

**ఐపీఎల్‌లో నేడు**
**బెంగళూరు X హైదరాబాద్**
**వేదిక: లక్నో**
**రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో**

# క్వార్టర్స్‌లో శ్రీకాంత్



మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లగా.. హెచ్.ఎస్.ప్రణయ్, కరుణాకరన్, ఆయుష్ శెట్టి టోర్నీ నుంచి నిష్క్రమించారు. కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లగా.. హెచ్.ఎస్. ప్రణయ్, కరుణాకరన్, ఆయుష్ శెట్టి టోర్నీ నుంచి నిష్క్రమించారు. గురువారం పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 2321, 2117తో నుయెన్ (ఐర్లాండ్)పై విజయం సాధించాడు. ప్రణయ్ 921, 1821తో యుషి తనక (జపాన్) చేతిలో, కరుణాకరన్ 1421, 1621తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, ఆయుష్ 1321, 1721తో టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో జోడీ 2117, 1821, 2115తో జూలియెన్ మైవో లియా పాలెర్మో (ఫ్రాన్స్) జంటపై నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రేరణ ఆల్వేకర్ మృణ్మయి దేశ్‌పాండే జోడీ 921, 1421తో సు యిన్ లిన్ యున్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడింది.

# ఆసియా పసిడి నిలబెట్టుకుంటా



**రాబోయే ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బరిలో దిగుతున్నానని తెలుగమ్మాయి, 100 మీటర్ల హర్డిల్స్ జాతీయ ఛాంపియన్ జ్యోతి యర్రాజి చెప్పింది. ఈనెల 27న దక్షిణ కొరియాలో ఈ పోటీలు ఆరంభం కాబోతున్న నేపథ్యంలో ఆమె ఇలా వ్యాఖ్యానించింది.**

దిల్లీ: రాబోయే ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బరిలో దిగుతున్నానని తెలుగమ్మాయి, 100 మీటర్ల హర్డిల్స్ జాతీయ ఛాంపియన్ జ్యోతి యర్రాజి చెప్పింది. ఈనెల 27న దక్షిణ కొరియాలో ఈ పోటీలు ఆరంభం కాబోతున్న నేపథ్యంలో ఆమె ఇలా వ్యాఖ్యానించింది. "రేసు ఆరంభంలో తొలి హర్డిల్‌ను అధిగమించే ముందు వేసే అడుగులను ఎనిమిది నుంచి ఏడుకు మార్చుకున్నా. 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట ఈ మార్పు జరిగింది. గాయాలను దృష్టిలో పెట్టుకుని రాబోయే టోర్నీల్లో మళ్లీ పాత టెక్నిక్ (ఎనిమిది అడుగులు)నే అనుసరించాలని నిర్ణయించా. ఏడు అడుగుల విధానం చాలా శక్తివంతమైంది. అయితే పొడవాటి కాళ్లు ఉండడం వల్ల గాయాలు అవుతున్నాయి. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పసిడి నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బరిలో దిగుతున్నా. తప్పులను దిద్దుకుని ముందుకు సాగాలి" అని జ్యోతి తెలిపింది. గాయాలు కాకుండా ఫిట్‌గా ఉంటే 13 సెకన్లలోపు టైమింగ్‌ను స్థిరంగా నమోదు చేయొచ్చని ఆమె పేర్కొంది. గత ఆసియా ఛాంపియన్‌షిప్‌లో జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌లో 13.09 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి నెగ్గింది. ప్రస్తుతం ఆమె జాతీయ రికార్డు 12.78 సెకన్లుగా ఉంది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి 59 మంది అథ్లెట్లు పోటీపడుతున్నారు.

# నీరజ్‌పైనే దృష్టి



**చాన్నాళ్లుగా ఊరిస్తున్న 90 మీటర్ల మైలురాయిని ఎట్టకేలకు దోహా డైమండ్ లీగ్‌లో చేరుకున్న భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా మరో పోరుకు సిద్ధమయ్యాడు. శుక్రవారం జరిగే ఓర్లెన్ అథ్లెటిక్స్ మీట్‌లో అతడు పోటీపడనున్నాడు.**

**ఓర్లెన్ అథ్లెటిక్స్ మీట్**

**హోజో (పోలెండ్): చాన్నాళ్లుగా ఊరిస్తున్న 90 మీటర్ల మైలురాయిని ఎట్టకేలకు దోహా డైమండ్ లీగ్‌లో చేరుకున్న భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా మరో పోరుకు సిద్ధమయ్యాడు. శుక్రవారం జరిగే ఓర్లెన్ అథ్లెటిక్స్ మీట్‌లో అతడు పోటీపడనున్నాడు. దోహాలో జావెలిన్‌ను 90.23 మీటర్లు వేసినా.. నీరజ్‌కు అగ్రస్థానం దక్కలేదు. జర్మనీ ఆటగాడు జులియన్ వెబర్ (91.06 మీ).. అతడిపై పైచేయి సాధించాడు. ఓర్లెన్ మీట్‌లో మరోసారి వెబర్‌తోనే నీరజ్‌కు సవాల్ ఎదురు కానుంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), పోలెండ్ జాతీయ ఛాంపియన్ మారిన్ కుకోస్కీ (పోలెండ్) కూడా గట్టిపోటీదారులే. దోహాకు మించిన ప్రదర్శన చేయగలనని ఇటీవలే చోప్రా చెప్పిన నేపథ్యంలో ఓర్లెన్‌లో అతడెలా రాణిస్తాడో చూడాలి.**

# ప్లేఆఫ్స్ పోరు ముందు ఆర్సీబీకి ఓ శుభవార్త!



**ఆర్సీబీ ఆటగాడు జాకబ్ బెతెల్ ఐపీఎల్ ప్లేఆఫ్స్‌నకు అందుబాటులో ఉండటం లేదు. అతడి స్థానంలో న్యూజిలాండ్ ఆటగాడైన టిమ్ సీఫెర్ట్ బెంగళూరు జట్టులో చేరనున్నాడు.**

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకుంది. 12 మ్యాచుల్లో ఎనిమిదింట్లో విజయం సాధించింది. 17 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇలాంటి కీలక సమయంలో ఆర్సీబీ జట్టులో ఓ మార్పు జరగనుంది. భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ ఓ వారంపాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. పునఃప్రారంభమైన తర్వాత షెడ్యూల్లో మార్పుల కారణంగా ఇంగ్లండ్ ఆటగాడైన జాకబ్ బెతెల్.. ఐపీఎల్ ప్లేఆఫ్స్ ఆడటం లేదు. మే 29 నుంచి ఇంగ్లండ్, వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జాకబ్ బెతెల్ ఆర్సీబీకి అందుబాటులో ఉండటం లేదు. ఇతడి స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులోకి న్యూజిలాండ్ ఆటగాడైన టిమ్ సీఫెర్ట్ రానున్నాడు. ఇందుకుగాను బెంగళూరు యాజమాన్యం ఇతడికి రూ.రెండు కోట్లు చెల్లించనుంది. ఈ మేరకు సీఫెర్ట్‌తో ఆర్సీబీకి గురువారం ఒప్పందం కుదిరింది. ఇది మే 24 నుంచి అమల్లోకి రానుంది. ఈ శుభవార్తతో ఆర్సీబీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే ప్లేఆఫ్స్‌నకు చేరుకున్న ఆర్సీబీ మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లీగ్ మ్యాచ్ ఆడనుంది. జాకబ్ బెతెల్‌కు ఈ సీజన్‌లో ఇదే చివరి ఐపీఎల్ మ్యాచ్ కానుంది. అనంతరం అతడు మే 24న స్వదేశం చేరుకుని, ఇంగ్లండ్ జట్టుతో కలవనున్నాడు. మే27న ఆర్సీబీ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో టిమ్ సీఫెర్ట్ పాల్గొనే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 66 టీ20లు ఆడిన సీఫెర్ట్ 1,540 పరుగులు చేశాడు. గతంలో 2022 సీజన్‌లో ఈ న్యూజిలాండ్ ఆటగాడు మూడు ఐపీఎల్ మ్యాచ్‌లు కూడా ఆడాడు.

మరోవైపు గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మరో ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ కూడా ప్లే ఆఫ్స్‌నకు అందుబాటులో ఉండటం లేదు. ఇంగ్లండ్, వెస్ట్ఇండీస్ మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు జరగనుండటమే దీనికి కారణం.

# ఆయుష్‌కు అండర్-19 పగ్గాలు

**వచ్చే నెలలో ఇంగ్లాండ్‌లో పర్యటించే భారత అండర్-19 జట్టుకు ముంబయి ఆటగాడు ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. 14 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా ఈ జట్టులో చోటు లభించింది. ఐపీఎల్‌లో చెన్నై తరఫున మాత్రే, రాజస్థాన్ తరఫున వైభవ్ రాణించిన సంగతి తెలిసిందే.**

**వైభవ్ సూర్యవంశీకి చోటు**
**ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టు**

దిల్లీ: వచ్చే నెలలో ఇంగ్లాండ్‌లో పర్యటించే భారత అండర్19 జట్టుకు ముంబయి ఆటగాడు ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. 14 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా ఈ జట్టులో చోటు లభించింది. ఐపీఎల్‌లో చెన్నై తరఫున మాత్రే, రాజస్థాన్ తరఫున వైభవ్ రాణించిన సంగతి తెలిసిందే. వైభవ్.. గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించాడు. అతడు బిహార్ తరఫున అయిదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, ఒక లిస్ట్‌ఎ మ్యాచ్ కూడా ఆడాడు. 17 ఏళ్ల మాత్రే 9 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, ఏడు లిస్ట్‌ఎ మ్యాచ్‌లు ఆడాడు. ఇక ముంబయి వికెట్‌కీపర్ బ్యాటర్ అభిజ్ఞాన్ కుందు అండర్19 జట్టు వైస్‌కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జూన్ 24న మొదలయ్యే ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ ఒక 50 ఓవర్ల వార్మప్ మ్యాచ్, 5 యూత్ వన్డేల సిరీస్, రెండు బహుళ రోజుల మ్యాచ్‌లు ఆడుతుంది.

భారత్ అండర్19 జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్‌సిగ్ చవ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు (వైస్‌కెప్టెన్), హర్‌వంశ్ సింగ్, అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, యుధజిత్ గుహ, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఎనాన్, ఆదిత్య రాణా, అన్మోల్‌జీత్ సింగ్.

